క్లుప్తంగా

బీజేపీ మండల అధ్యక్షుడిగా సందీప్

కేసముద్రం: ఇనుగుర్తి మండల బీజేపీ అధ్యక్షుడిగా దుంపల సందీప్, జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా పోలెపల్లి వెంకటేశ్వర్లు ఎన్నికైనట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

'దోస్త్'ను సద్వినియోగం చేసుకోవాలి

తొర్రూరు: డిగ్రీ కళాశాలల్లో 2025–26 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం చేపట్టే దోస్త్ ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బి. రాములు అన్నారు. డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం దోస్త్ ప్రవేశాల వివరాలను ప్రిన్సిపాల్ వెల్లడించారు. ఈనెల 21 వరకు ఆన్‌లైన్ నమోదుకు అవకాశం ఉందన్నారు. కళాశాలలో నమోదు అవకాశం కల్పించామన్నారు. ఇతర వివరాలకు 90597 62412, 98485 29152 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

రెండో రోజు కొనసాగిన దీక్ష

గార్ల: పాకాల ఏటిపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో పాకాల ఏటి వద్ద చేస్తున్న నిరాహార దీక్ష సోమవారం రెండో రోజు కొనసాగింది. దీక్షను ఉద్దేశించి సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కట్టెబోయిన శ్రీనివాసరావు మాట్లాడారు. దీక్షలో రాగం రమేష్, జనార్దన్, వీరన్న, నాగేష్, లోకేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

కొనుగోళ్ల జాప్యంపై రైతుల ఆగ్రహం

మరిపెడ రూరల్: మరిపెడ మండలం తండధర్మారం ఐకేపీ కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోలు చేయడంలో నిర్వాహకులు తీవ్ర జాప్యం చేస్తున్నారని బాధిత రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సోమవారం బాధిత రైతులు శంకర్, జామ్లా, బీచ్చ తదితర రైతులు మాట్లాడుతూ.. తండధర్మారం ఐకేపీ కొనుగోలు కేంద్రంలో ధాన్యం పోసి నెలరోజులు దాటినప్పటికీ కాంటా పెట్టడంలో నిర్వాహకులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు.

రైతులకు ఇబ్బంది తలెత్తకుండా చూడాలి

కేసముద్రం: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సీపీఎం మండల కార్యదర్శి గోడిశాల వెంకన్న అన్నారు. మండలంలోని తాళ్ల పూసపల్లి గ్రామంలోగల ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు పడుతున్న ఇబ్బందులపై సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పండించిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు సెంటర్‌కు వస్తే నెలరోజులుగా కాంటాలు పెట్టకుండా, రవాణా చేయకుండా ఇబ్బందులు పెట్టడం సరికాదని తెలిపారు. ఇప్పటికైనా గన్ని సంచులు సమకూర్చి లారీలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శేఖర్, అయిలయ్య, అంజయ్య, రమేష్, శ్రీనివాస్, కొమురమ్మ పాల్గొన్నారు.

వైభవంగా సుదర్శన యజ్ఞం

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని శ్రీ వేణుగోపాలస్వామి వారి దేవాలయంలో సుదర్శన యజ్ఞం పూజా కార్యక్రమాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ముదుంబై లక్ష్మీనారాయణ చార్యులు, దత్తు, రమణ ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలోని యాగశాలలో సుదర్శన యజ్ఞం నిర్వహించారు. శ్రీరుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామివారి అష్టోత్తర శతనామ పూజ, సుదర్శన భగవానుడి అష్టోత్తర శతనామ పూజ జరిపి భక్తుల గోత్రనామాలపై అర్చన చేశారు. సుదర్శన యజ్ఞం పూర్తి అనంతరం పూర్ణాహుతి పూజ చేసి భక్తులకు ఆశీర్వచనాలు అందజేశారు.

వీధులు నిర్మానుష్యం



దోర్నకల్: తీవ్రమైన ఎండలతో దోర్నకల్‌లోని పలు ప్రధాన వీధులు నిర్మానుష్యంగా మారాయి. ఉదయం ఏడు గంటల నుంచే ఎండ తీవ్రత పెరగడంతో వీధుల్లో జనసంచారం కనిపించలేదు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు వీధులు నిర్మానుష్యంగా మారాయి.

చెక్కు అందజేత

గార్ల: మంత్రి సీతక్క ఆదేశాలతో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను సోమవారం కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి కృష్ణగౌడ్ లబ్ధిదారు కవితకు రూ.60వేల చెక్కును అందజేశారు.

పేరుకుపోతున్న ధాన్యం..

- కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగుల కొరత
- ధాన్యం తరలింపునకు ఇబ్బందులు
- రైతులకు తప్పని పడిగాపులు



కొనుగోలు కేంద్రంలో పేరుకుపోయిన ధాన్యం

పెద్దవంగర: ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం అమ్ముకోవడానికి రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యాసంగిలో వరి ధాన్యం దిగుబడులను ఎక్కువగా సాధించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్ద వరి ధాన్యం రాసులు పేరుకుపోతున్నాయి. దీంతో ఎప్పుడు కాంటాలు పెడతారని రైతులు వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నారు. సరిపడా గన్నీ బ్యాగులు కొనుగోలు కేంద్రాలకు పంపకపోవడంతో ధాన్యం కొనుగోళ్ల నత్తనడకన సాగుతున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలోని పీఏసీఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో ప్రభుత్వం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఇప్పటి దాకా ఆయా కేంద్రాల చొరవతో 2,66,354 క్వింటాళ్లు కొనుగోలు చేసినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఇవి కాక మరిన్ని ధాన్యం రాసులు కొనుగోలు కేంద్రాల దగ్గర అలాగే ఉండిపోయాయి. బయట మార్కెట్ కంటే ప్రభుత్వ కొనుగోలు చేస్తున్న చోట వడ్ల ధర అధికంగా ఉండడంతో రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు తరలించేందుకు ఆసక్తి చూపుతున్నారు. అకాల వర్షాలతో వడ్లు తడిస్తే ఇబ్బంది అని రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు త్వరగా కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

కొనుగోళ్లలో వేగం పెంచాలి

గన్నీ సంచులు లేక వడ్ల కొనుగోలు మరింత ఆలస్యం అవుతున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. గన్నీ సంచులు సరిపడా లేకపోవడంతో వాటి కోసం ఎదురు చూస్తున్నారు. కాంటా వేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు లారీల సమస్య తీవ్రంగా ఉంది. వాహనాలు లేకపోవడంతో కొనుగోలు కేంద్రాల దగ్గరే ధాన్యం ఉండి పోతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. తూకం వేసి వడ్ల బస్తాలు సుమారు 60వేల వరకు కొనుగోలు కేంద్రాల వద్దనే ఉన్నట్లు సమాచారం. ఇటీవల కురిసిన వర్షానికి ఆందోళన చెందిన రైతులు మండల కేంద్రంలో ఓ రైతు పెట్రోల్ సీసాతో మరో రైతు ధాన్యాన్ని నిప్పంటి నిరసన సైతం తెలిపాడు. ఈ విషయం సంబంధిత అధికారులకు తెలిసిన ధాన్యంను తరలించడంలో జాప్యం జరుగుతూనే ఉంది. ఇక ధాన్యం కొనుగోలులో ఆలస్యం లేకుండా వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు.

ఆందోళన అవసరం లేదు



రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది. గన్నీ సంచులు అందుబాటులో ఉన్నాయి. లారీలు మరికొన్ని ఎక్కువ పెంచి తరలింపు వేగవంతం చేస్తాం. జిల్లా అధికారులతో మాట్లాడి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టుతున్నాం.

– కాకిరాల హరిప్రసాద్, పీఏసీఎస్ చైర్మన్, తొర్రూరు

'ఇందిరమ్మ ఇళ్ల'లో కేంద్రం వాటా అధికం



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

దంతాలపల్లి: రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పేరును ప్రధానమంత్రి అవాస యోజన పేరుతో పంపిణీ చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం పార్టీ ఆధ్వర్యంలో మండలకేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పంపిణీ చేస్తున్న ఇళ్లలో కేంద్ర ప్రభుత్వం వాటా 80శాతం, రాష్ట్ర ప్రభుత్వం వాటా 20శాతంగా ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న వాట ప్రజలకు తెలియకుండా రాష్ట్ర ప్రభుత్వం కప్పిపుచ్చుతూ, తమ నాయకుల పేర్లు పెట్టుకుంటుందని తెలిపారు. అంతే కాకుండా అర్హులైన వారికి పథకాలు ఇవ్వకుండా నాయకులకు మాత్రమే ఇస్తుందని ఆరోపించారు. ప్రధాన మంత్రి అవాస యోజన పథకంలో ఏదైన అక్రమాలు జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో మాజీ ప్రధాన కార్యదర్శి చీకటి మహేష్ గౌడ్, మండల అధ్యక్షుడు భరత్, మురళీకృష్ణ, కారుపోతుల ఉప్పలయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య



బానోతు హచ్చ (ఫైల్)

గూడూరు: ఆర్థిక ఇబ్బందులతో ఓ గిరిజన రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని పొనుగోడులో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పొనుగోడుకు చెందిన బానోతు హచ్చ (56), గుడి దంపతులకు ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. ఎకరం పొలం ఉంది. ఇటీవల ఇంటి నిర్మాణం చేసుకున్నారు. దాని కోసం కొంత అప్పు చేశారు. దీంతో పంట సాగుకు, ఇంటి నిర్మాణానికి తెచ్చిన అప్పు ఎలా తీర్చాలా అని రైతు హచ్చ కొంతకాలంగా మానసిక బాధ పడుతున్నాడు. ఆదివారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటికి వెళ్లిన హచ్చ రాత్రి ఇంటికి రాలేదు. రాత్రి నుంచి గాలిస్తుండగా, ఉదయం గ్రామ సమీప వ్యవసాయ బావిలో శవమై కనిపించాడు. మృతుడి కుమారుడు బానోతు సురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బావిలో పడి వలసకూలీ మృతి

బయ్యారం: ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి వలసకూలీ మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి మండల పరిధిలోని నామాలపాడులో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఒడిశా రాష్ట్రంలోని అమరకోటకు చెందిన గౌతమ్(53) ఇటుకల బట్టిలో పనిచేసేందుకు కుటుంబ సభ్యులతో కలిసి వచ్చాడు. సాయంత్రం పని ముగిసిన తర్వాత స్నానానికి వెళ్లిన గౌతమ్ తిరిగిరాకపోవడంతో అనుమానం వచ్చిన తోటి కూలీలు ఆయన ఆచూకీ కోసం వెతికారు రాత్రి గౌతమ్ మృతదేహం బావిలో కనపడడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై మౌనిక సంఘటన స్థలాన్ని సందర్శించి మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రికి తరలించారు.

శిక్షణ తరగతుల సమయాన్ని మార్చాలి



మాట్లాడుతున్న చాగంటి ప్రభాకర్

మహబూబాబాద్ అర్బన్: తెలంగాణ వ్యాప్తంగా నేడు ప్రారంభమయ్యే ఉపాధ్యాయుల శిక్షణ తరగతుల సమయాన్ని ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు నిర్వహించాలని ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి ప్రభాకర్ కోరారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున సమయాన్ని మార్చాలని, శిక్షణ తరగతులకు మౌళిక వసతులు కూలర్, మంచినీటి సౌకర్యాలు కల్పించాలన్నారు. ఆరునెలల లోపు పదవీ విరమణ పొందే ఉపాధ్యాయులను శిక్షణ తరగతుల నుంచి మినహాయించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి ఈదునూరి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి బెతమల్ల నీలయ్య, బాధ్యులు దాసరి మహేందర్, హరినాయక్,, వీరన్న పాల్గొన్నారు.

అక్రమ డిప్యుటేషన్లు రద్దు చేయాలి

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలో గిరిజన ఆశ్రమ పాఠశాలలో అక్రమ డిప్యుటేషన్లు రద్దు చేసి, హెచ్ఎంల, వార్డెన్ల అవినీతిని అరికట్టాలని ఎస్సీ, ఎస్టీ బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు పొన్నాల యుగంధర్ డిమాండ్ చేశాడు. జిల్లా కేంద్రంలోని పాతబజారులో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని ఉన్న బాలికల ఆశ్రమ పాఠశాల, పత్తిపాక, ముత్యాలమ్మగూడెం, కురవి, కేసముద్రం, ఇస్లాపురం, గార్ల, దంతాలపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాల్లో హాస్టల్స్‌కు హెచ్ఎం, వార్డెన్లు పరిమితం అయ్యారని, వాస్తవానికి వారి పోస్టు వేరే పాఠశాలలో ఉన్నప్పటికీ గత కొన్ని సంవత్సరాల నుంచి మానుకోటలోనే పరిమితమైపోయారన్నారు. వార్డెన్లు అవినీతికి అక్రమాలు విద్యార్థుల డైట్ బిల్లులోనే ఉందని, వార్డెన్లపై విచారణ చేయాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు సుధాకర్, మహేష్, శశి, బాలు, తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ప్రభాకర్

కురవి: డ్రగ్స్ వద్దని, ప్రాణాలు ముద్దు అని మత్తు పదర్థాలకు దూరంగా ఉండాలని, మద్యం తాగవద్దని సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం గోరంట్ల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు రాచకొండ ప్రభాకర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని వారాంతంపు పశువుల సంతలో 'వద్దు వద్దు మద్యం, డ్రగ్స్ వద్దు ఆరోగ్యమే ముద్దు' అనే అంశంపై స్వచ్ఛందంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విచిత్ర వేశాధారణతో మైకు పట్టుకుని, కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కురవి ఏఎస్సై వెంకన్న, కానిస్టేబుల్ తదితరులు పాల్గొన్నారు.

చదువుకుంటే అత్యున్నత స్థానం



విద్యార్థిని సన్మానిస్తున్న నాయకులు

గూడూరు: చదువుకున్న ప్రతీ ఒక్కరికీ సమాజంలో అత్యున్నత స్థానం లభిస్తుందని గోర్ సభ రాష్ట్ర అధ్యక్షుడు బానోతు మంగీలాల్‌నాయక్, టీపీటీఎఫ్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు మైస శ్రీనివాస్ అన్నారు. మండలంలోని లక్ష్మీపురంలో 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో తీగలవేణి జెడ్పీహెచ్ఎస్ నుంచి 579 మార్కులు సాధించి, మండల టాపర్‌గా, జెడ్పీహెచ్ఎస్ సెక్టార్‌లో జిల్లా టాపర్‌గా నిలిచిన బాదావత్ పరమేశ్వరీని సోమవారం గోర్ సభ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అజ్మీరా భిచ్చానాయక్, జరుపుల వీరన్ననాయక్, అర్జున్ చౌహాన్, బొమ్మగాని కలమసత్యం పాల్గొన్నారు.

గుండెపోటుతో వ్యాపారి మృతి

కురవి: గుండెపోటుతో చిరు వ్యాపారి వందనపు శ్రీనివాస్(60) సోమవారం మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని రాజోలు గ్రామానికి చెందిన శ్రీనివాస్, భార్య శ్రీదేవి ఇద్దరు మొగిలిచర్ల గ్రామంలో నివాసం ఉంటున్నారు. వీరు ఇద్దరు కలసి ద్విచక్రవాహనంపై సోమవారం కురవికి వచ్చి సాయంత్రం వెళ్లారు. గుండెలో నొప్పి వస్తుందని శ్రీనివాస్ భార్యతో చెప్పడంతో మహబూబాబాద్‌కు తరలిస్తుండగా మృతి చెందాడు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ప్రారంభం

పాలకుర్తి టౌన్: వేసవిలో విద్యుత్ సరఫరాలో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా నూతనంగా నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లను ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి కాలంలో విద్యుత్ వినియోగం పెరగడంతో ఓవర్‌లోడ్ సమస్యలను తగ్గించేందుకు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ డీఈ రాంబాబు, ఏఈ రణదీర్, నాయకులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

- ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



విద్యార్థిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే

కొడకండ్ల : అధికారం చేపట్టిన నాటి నుంచి విద్యాభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తుందని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక పద్మశాలి మార్కండేయ భవనంలో నియోజకవర్గంలోని కొడకండ్ల, పాలకుర్తి, దేవరుప్పుల, తొర్రూరు, పెద్దవంగర, రాయపర్తి మండలాల్లో పదో తరగతిలో 550కి పైగా మార్కులు సాధించిన 143 మంది విద్యార్థులకు హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో సన్మానించి నగదు, ప్రశంస పత్రాలను అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడారు. పది రోజుల్లో తొర్రూరులో కంప్యూటర్ సెంటర్‌ను ప్రారంభించి నిష్ణాతులైన ప్యాకల్టీలతో శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో వందేమాతరం పౌండేషన్ చైర్మన్ రవీందర్‌రావు, డీఈఓ బోజన్న, ఎంఈఓలు, హెచ్ఎంలు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెక్‌డ్యాంల నిర్మాణానికి చర్యలు

తొర్రూరు రూరల్: గ్రామీణ ప్రాంతాలకు చెందిన రైతాంగానికి సాగునీటిని అందించేందుకే చెక్‌డ్యాంలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని గుర్తూరు గ్రామ శివారులోని ఆకేరువాగుపై ఉన్న పాతకాలం నాటి చెక్‌డ్యాంను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. త్వరలోనే నిధులను మంజూరు చేయించి చెక్‌డ్యాంల నిర్మాణాల కోసం చర్యలు తీసుకొని పంటల సాగును పెంచేందుకు కృషి చేస్తామని తెలిపారు.

ఆరోగ్య సంరక్షణలో నర్సుల పాత్ర కీలకం



నర్సులను సత్కరిస్తున్న వైద్యులు

తొర్రూరు: ఆరోగ్య సంరక్షణలో నర్సుల పాత్ర కీలకమని ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ పగిడిపాటి సుగుణాకర్‌రాజు అన్నారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నర్సులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సూపరింటెండెంట్ మాట్లాడుతూ.. రోగుల సంరక్షణ, భద్రతను మెరుగుపర్చడం ద్వారా ఆరోగ్య సంరక్షణను మానవీకరించడంలో నర్సులు కీలకంగా వ్యవహరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి జ్యులిత, వైద్యులు మీరాజ్, ప్రియాంక, మానస, శంకర్, ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనారాయణుడి తిరుకల్యాణం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

గూడూరు: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనారాయణస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం రాత్రి తిరు కల్యాణోత్సవ వేడుకలు కనుల పండువగా జరిగాయి. సాయంత్రం 7గంటలకు అశ్వవాహనంపై లక్ష్మీనారాయణస్వామి, పల్లకిలో లక్ష్మీదేవి విగ్రహాలను పట్టణ వీధుల్లో ఊరేగించారు. ఆలయ చైర్మన్ ఏపూరు శ్యాంసుందర్‌రెడ్డి ఇంటి నుంచి పట్టువస్త్రాలతో పాటు తలంబ్రాలను మేళతాళాల నడుమ తీసుకురాగా, దేవాలయం ఎదుట సంప్రదాయ రీతిలో నిర్వహించిన ఎదుర్కోలు కార్యక్రమం భక్తులను అలరించింది. దాంతం వరదరాజాచార్యులు, అర్చకుడు వేణుగోపాలాచార్యుల ఆధ్వర్యంలో యాజ్ఞికులు సంద్యాల అనంతోశరాజన్, సముద్రాల గోపాలక్రిష్ణమాచార్యులు, వంశీకృష్ణమాచార్యులు స్వామివారి తిరు కల్యాణోత్సవ వేడుకలను కమనీయంగా జరిపించారు. భక్తుల సందడితో ఆలయం కిటకిటలాడింది. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి, డాక్టర్ ఏపూరు రవీందర్‌రెడ్డి, దేవాలయ కమిటీ అధ్యక్షుడు నూనావత్ రమేష్‌నాయక్, మేరుగు నరేష్‌గౌడ్, కాల్వాని వేణుమాధవ్‌రెడ్డి, ఎస్సై గిరిధర్ రెడ్డి పాల్గొన్నారు.

సుదర్శన యాగం

మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనారాయణస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం 5వ రోజు శ్రీ సదుర్శనయాగం పూజలను యాగ్నికులు అత్యంత భక్తిశ్రద్ధలు, వేదమంత్రోశ్ఛరణల నడుమ నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు వేదాంతం వరదరాజాచార్యులు, అర్చకులు వేణుగోపాలాచార్యుల ఆధ్వర్యంలో యాగ్నికులు సంద్యాల అనంతోశరాజన్, సముద్రాల గోపాలక్రిష్ణమాచార్యులు, వంశీకృష్ణమాచార్యులు మూడు గంటల పాటు జరిపించారు.

వేసవి శిక్షణ శిబిరాలు


కురవి: వేసవిలో విద్యార్థులు ఎండలో తిరగకుండా ఉండేందుకు ప్రభుత్వం వేసవిలో శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేసింది. దీంతో సోమవారం మండల కేంద్రంతోపాటు రాజోలు జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ప్రతి రోజు ఉదయం ఉపాధ్యాయులు విద్యార్థులకు ఆటపాటలను నేర్పుతున్నారు. ఆంగ్లం, డిజిటల్ బోధన చేస్తు ఆకట్టుకుంటున్నారు. విద్యార్థులకు స్నాక్స్ పెడుతూ విద్యార్థులను ఆకర్షిస్తున్నారు. కార్యక్రమంలో హెచ్ఎంలు ఎండీ వాహిద్, వెంపటి విజయ్‌రాజ్, ముత్యాల శ్రీధర్, లక్ష్మయ్య, నరసింహాచారి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

విమర్శించడం సరికాదు

గూడూరు: అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో ముందుండి పనిచేసిన వారిని విమర్శించడం సరికాదని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కమిటీ కన్వీనర్ కత్తి స్వామి, సంఘం మండల అధ్యక్షుడు సింగుడాల వీరస్వామి అన్నారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో సోమవారం వారు మాట్లాడారు. పది సంవత్సరాలుగా నిరాదరణకు గురైన అంబేడ్కకర్ విగ్రహాన్ని పట్టించుకోని కొందరు రాజకీయ నాయకులు, విగ్రహావిష్కరణ తరువాత తమను గుర్తించలేదనడం సమంజసం కాదన్నారు. ప్రతీ ఒక్కరినీ కార్డు ఇచ్చి ఆహ్వానించాం, వారు కూడా వారికి తోచిన విధంగా కార్యక్రమానికి విరాళాలు ఇచ్చారు. పైగా పిలవలేదు అనడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. కార్యక్రమంలో హెచ్ శివ, రమేష్, సారయ్య, మహేశ్ పాల్గొన్నారు.

కిరాణ, వర్తక సంఘం ప్రమాణస్వీకారం



మహబూబాబాద్ అర్బన్: మానుకోట కిరాణ, వర్తక సంఘం నూతన అధ్యక్షుడిగా సోమా రత్నశేఖర్, ప్రధాన కార్యదర్శిగా కొండ్లె బద్రీనాథ్, కోశాధికారి గుండా మధుకర్‌రెడ్డిలు ఆదివారం రాత్రి జిల్లా కేంద్రంలోని కిరాణవర్తక సంఘం భవనంలో ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గౌరవ అధ్యక్షులు నారాయన మూర్తి, శ్రీరంగం నర్సిహరావు, విద్యాసాగర్, సభ్యులు పాల్గొన్నారు.

మొక్కుల చెల్లింపు

గార్ల: మండలంలోని అంజనాపురం గ్రామంలో బొడ్రాయి దేవత సీతలాపరమేశ్వరీకి మహిళలు సోమవారం బోనాలతో మొక్కులు చెల్లించారు. గ్రామంలో సందడి నెలకొంది.

మండల అధ్యక్షుడిగా కృష్ణారెడ్డి



గార్ల: టీడీపీ మండల అధ్యక్షుడిగా వై కృష్ణారెడ్డి ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గార్లలోని టీడీపీ కార్యాలయంలో జరిగిన పార్టీ సంస్థాగత ఎన్నికల సమావేశానికి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ ఇమామ్ ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శిగా కత్తి సత్యంగౌడ్, ఉపాధ్యక్షుడిగా బానోత్ రామ్‌జీ, కార్యనిర్వాహక కార్యదర్శులుగా ఎన్.ప్రభాకర్, జాస్తి రాజా, ఎం.దరశథ్, కార్యదర్శులుగా శిరిమర్తి వీరన్న, ఎస్‌కె.ఖాసీం బీ, టీ.శ్రీనివాసరెడ్డి, కోశాధికారిగా సుంకర ఉపేందర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రైతు ఆత్మహత్యాయత్నం

దంతాలపల్లి: కాంటా పెట్టిన ధాన్యం మిల్లుకు తరలించడం లేదని ఓ రైతు ఆత్మహత్యాయత్నం చేసుకున్న సంఘటన మండలంలోని కుమ్మరికుంట్ల కొనుగోలు కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కర్రె యాకుబ్ 390 బస్తాల ధాన్యం కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చాడు. నిర్వాహకులు యాకుబ్ ధాన్యం కాంటాలు పెట్టారు. త్వరగా ధాన్యం తరలించాలని నిర్వాకులను అడిగాడు. అప్పటికే గ్రామానికి చెందిన రైతు, బీఆర్ఎస్ నాయకుడి ధాన్యం కాంటాలు నిర్వహించారు. తన ధాన్యం తరలించాకే నీ ధాన్యం తరలిస్తారని బీఆర్ఎస్ నాయకుడు యాకుబ్‌తో చెప్పాడు. దీంతో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగింది. ఎమ్మెల్యేకు చెప్పుకోపో ఏం చేస్తాడో చూద్దాం.. కొనుగోళ్ల నిర్వహిస్తున్నస్థలం తనది అని బీఆర్ఎస్ నాయకుడు అన్నాడు. దీంతో మనస్తాపం చెందిన రైతు యాకబ్ కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యా ప్రయత్నం చేశాడు. గమనించిన రైతులు, నిర్వాహకులు అడ్డుకొని యాకుబ్‌కు సర్ది చెప్పారు.

మిస్సింగ్ కేసు నమోదు



నర్సింహులపేట: మండలంలోని లోక్యాతండాకు చెందిన 42 సంవత్సరాల భూక్య హోంజీ రెండు రోజులుగా కన్పించకపోవడంతో మిస్సింగ్ కేసు నమోదు అయినట్లు ఎస్సై మాలోతు సురేష్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మే 10న నర్సింహులపేటలో సంతకు వెళ్తానని చెప్పి, ఇంట్లో నుంచి వెళ్లిన హోంజీ రెండు రోజుల నుంచి రాలేదు. భార్య భూక్య సునీత ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పారదర్శకంగా కమిటీల ఎన్నిక

నెల్లికుదురు: కాంగ్రెస్ పార్టీ మండల, గ్రామ, బ్లాక్ కమిటీల ఎన్నిక పారదర్శకంగా జరుగుతుందని, ఆందోళన చెందకుండా సమన్వయం పాటించాలని ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎన్నికల ఇన్‌చార్జ్‌లు రవళిరెడ్డి, నాగేశ్వరరావు మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలకు సూచించారు. మండల కేంద్రంలోని ఓ గార్డెన్‌లో సోమవారం నిర్వహించిన పార్టీ సంస్థాగత సమావేశంలో వారు మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా కమిటీల ఎన్నిక అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఒక తాటిపై నడవాలని సూచించారు. కమిటీల ఎన్నికకు వివిధ గ్రామాల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. అంతకు ముందు అమరుడైన జవాన్ మురళీ నాయక్‌కు నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎడ్ల యాదవరెడ్డి, ప్రభాకర్‌గౌడ్, నాయకులు గుట్టయ్య గౌడ్, సత్యపాల్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, బాలాజీనాయక్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.